శిక్షణ పొందిన క్రీడాకారులు

- అద్భుతంగా రాణిస్తున్న మండల విద్యార్థులు
- 9మందికి ఇంటర్నేషనల్ స్టార్ ఆఫ్ ఇండియా అవార్డు
- పేద కుటుంబాల్లో మెరుస్తున్న ఆణిముత్యాలు
- పిల్లలను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు
- ఉత్తమ తర్ఫీదునిస్తున్న అమరేషు లింగయ్య

**బాల్ బ్యాడ్మింటన్ క్రీడలో బోనకల్లు మండల విద్యార్థులు అద్భుతంగా రాణిస్తున్నారు. పేదరికం వెనక్కి లాగుతున్నప్పటికీ చదువుతోపాటు ఆటల్లోనూ అబ్బురపరుస్తున్నారు. మంచి క్రీడానైపుణ్యంతో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. ఆర్థికంగా ఇబ్బంది ఉన్నప్పటికీ తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను క్రీడల్లో ప్రోత్సహిస్తున్నారు. 1996 నుంచి నేటివరకు రాష్ట్ర, జాతీయ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ క్రీడాపోటీల్లో ఈ ప్రాంతానికి చెందిన క్రీడాకారులు అత్యంత ప్రతిభ చాటారు. ఇంటర్నేషనల్ పోటీల్లో జాతీయ స్టార్ఆఫ్ ఇండియాగా తొమ్మిది మంది గుర్తింపు సాధించి అనేక పతకాలు సొంతం చేసుకున్నారు. ఇదే ఉత్సాహంతో ఈ నెల చివరిలో జరిగే పోటీలకు సిద్ధమవుతున్నారు.**

## బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులకు
# పుట్టినిల్లు బోనకల్లు

మధిర, డిసెంబర్ 16 : ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని బోనకల్లు మండలానికి చెందిన క్రీడాకారులు బాల్ బ్యాడ్మింటన్ ఆటలో అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారు. మండలంలోని ముష్టికుంట్ల గ్రామానికి చెందిన అమరేషు లింగయ్య అనే క్రీడాకారుడు 1996లో బాల్ బ్యాడ్మింటన్ క్రీడపై మక్కువతో గ్రామస్థులతో కలిసి 'శాంతిస్నేహ యూత్' ఏర్పాటు చేశారు. ఇందులో కె.వీరయ్య, పారుపల్లి సురేశ్, చావా వెంకటేశ్వరరావు మరికొంతమంది కలిసి క్రీడాకారులను తయారుచేయడం ప్రారంభించారు. శాంతిస్నేహ యూత్ ఆధ్వర్యంలో ఎంతోమంది క్రీడాకారులను బాల్ బ్యాడ్మింటన్‌లో అద్భుత ప్రతిభావంతులుగా తీర్చిదిద్దారు. ఈ విధంగా తయారైన ఈ ప్రాంతంవారు 1996 నుంచి 2018 వరకు రాష్ట్ర, జాతీయ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ క్రీడాపోటీల్లో పాల్గొని ప్రతిభ చాటారు. ఇంటర్నేషనల్ పోటీల్లో 9మంది జాతీయ స్టార్ఆఫ్ ఇండియాగా ఎంపికై అనేక పతకాలు సొంతం చేసుకున్నారు. 2021-22లో కర్ణాటక రాష్ట్రంలోని అల్వాలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో టోపీని కైవసం చేసుకున్నారు. 2022 డిసెంబర్ 9, 10, 11 తేదీల్లో గోదావరిఖనిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో, డిసెంబర్ 24 నుంచి 28వ తేదీ వరకు కేరళ రాష్ట్రంలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పురుషులు, మహిళల జట్లు అద్భుతంగా ఆడారు. ఇప్పటివరకు శాంతిస్నేహ యూత్ ద్వారా 300 మంది బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులను తీర్చిదిద్దారంటే అతిశయోక్తి కాదు.

### అద్భుత క్రీడాకారులు వీరే..

- బాల్ బ్యాడ్మింటన్‌లో భూక్యా రమేశ్ అత్యంత ప్రతిభ కనబరిచి స్టార్ ఆఫ్ ఇండియా క్రీడాకారుడిగా ఎంపికయ్యారు. 2006 అక్టోబర్ 12 నుంచి 15వ తేదీ వరకు ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో 26వ సబ్ జూనియర్ జాతీయ పోటీల్లో ఆడారు. ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్నారు.
- 2006లో మహారాష్ట్రలోని చంద్రపూర్‌లో ఫిబ్రవరి 15 నుంచి 19 వరకు జూనియర్ జాతీయ పోటీల్లో భూక్యా ఉమ అత్యంత ప్రతిభ కనబరిచి స్టార్ ఆఫ్ ఇండియా క్రీడాకారిణిగా మన రాష్ట్రం నుంచి మొట్టమొదటిసారిగా ఎంపికైంది. 2013లో నేపాల్‌లో జరిగిన పోటీల్లో పాల్గొని అంతర్జాతీయ గుర్తింపు పొందింది. ప్రస్తుతం ఎంఎస్సీ బీఎడ్ పూర్తిచేసి హైదరాబాద్‌లో పోస్టల్‌శాఖలో స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించింది.
- హర్యానా రాష్ట్రంలో డెహ్రూన్‌లో 2007 జూన్ 1 నుంచి 4వ తేదీ వరకు జరిగిన సబ్ జూనియర్ పోటీల్లో జరుపల శివకృష్ణ స్టార్ ఇండియాగా గుర్తింపు తెచ్చుకున్నాడు. పీఈటీ ట్రైనింగ్ పూర్తి చేసి మండల కేంద్రంలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలలో ప్రస్తుతం పీఈటీ కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు.
- తమిళనాడులోని చెన్నైలో 2008 మార్చిలో జరిగిన సబ్ జూనియర్ పోటీల్లో, ముంబాయిలో 2012 డిసెంబర్‌లో నూనవత్ బుజ్జి స్టార్ ఆఫ్ ఇండియాగా ఎన్నికై రెండుసార్లు గుర్తింపు తెచ్చుకున్నది. ఖమ్మంలోని ప్రైవేట్ కళాశాలలో టీటీసీ ట్రైనింగ్ చేసి టీచర్‌గా పనిచేస్తున్నది.
- హర్యానా రాష్ట్రంలోని కురుక్షేత్రంలో 2009 మే 9 నుంచి 13వ తేదీ వరకు జరిగిన సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని జరుపల శివకృష్ణ స్టార్ ఆఫ్ ఇండియాగా గుర్తింపు తెచ్చుకున్నాడు. ప్రస్తుతం ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు.
- చెన్నైలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో 2011 జనవరిలో జరిగిన పోటీల్లో భూక్యా నరేశ్ స్టార్ ఆఫ్ ఇండియాగా పేరు సంపాదించాడు.
- 2009 కడపలో, 2010 రాజస్థాన్ రాష్ట్రంలోని దుల్‌ఘర్‌లో, 2012 కర్ణాటక రాష్ట్రంలోని తుమకూరులో జరిగిన సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో నూనావత్ గోపి స్టార్‌ఆఫ్ ఇండియాగా నిలిచాడు. మూడుసార్లు స్టార్ ఆఫ్ ఇండియా అవార్డును 19ఏండ్లకే సాధించి కీర్తి గడించాడు.
- తిరుపతిలో 2013 డిసెంబర్ 5 నుంచి 15వ తేదీ వరకు జరిగిన సబ్ జూనియర్ విభాగంలో బానోత్ గోపి ఆలిండియా బెస్ట్ ప్లేయర్‌గా స్టార్‌ఆఫ్ ఇండియా అవార్డు దక్కించుకున్నాడు.
- తమిళనాడు రాష్ట్రంలోని మధురై ప్రాంతంలో 2014లో అక్టోబర్ 1 నుంచి 5వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి పోటీల్లో భూకా దుర్గాప్రసాద్ స్టార్ ఆఫ్ ఇండియాగా గుర్తింపు తెచ్చుకున్నాడు.

### ఈ ఏడాది పోటీలకు సిద్ధమైన క్రీడాకారులు

బోనకల్లు కేంద్రంగా బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. 2023 డిసెంబర్‌లో జరిగే పోటీలకు పరుగులు తీస్తున్నారు. గోదావరిఖనిలో జరిగే పోటీల్లో టైటిల్‌ను సొంతం చేసుకునేందుకు మహిళ జట్లు తహతహలాడుతున్నది. డిసెంబర్ 22 నుంచి 24వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా జట్లు సంసిద్ధమవుతున్నారు. డిసెంబర్ 14 నుంచి 17వ తేదీ వరకు శిక్షణ పొందుతున్నారు.

### కోచ్‌గా రాణిస్తున్న లింగయ్య

బోనకల్లు మండలం నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులను తయారుచేయడంలో ముష్టికుంట్ల గ్రామానికి చెందిన అమరేషు లింగయ్య కృషి మరువలేనిది. మండల కేంద్రంలో ఆడియో రికార్డింగ్ సెంటర్ నడుపుతూ వచ్చిన కొద్ది డబ్బులతో కుటుంబాన్ని పోషించుకుంటున్న లింగయ్య మంచి బాల్ బ్యాడ్మింటన్ కోచ్‌గా పేరు సంపాదించుకున్నారు. పేద కుటుంబంలో పుట్టినప్పటికీ తన ఇద్దరు కూతుర్లు ఉష, నిరోషాకు బాల్ బ్యాడ్మింటన్‌లో తర్ఫీదు ఇచ్చారు. వీరితోపాటు అనేకమంది విద్యార్థులను బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్నారు.

## భద్రాచలంలో కొనసాగుతున్న అధ్యయనోత్సవాలు
### నాలుగో రోజూ స్వామిని దర్శించి తరించిన భక్తులు

భద్రాచలం, డిసెంబర్ 16: భద్రాద్రి దివ్యక్షేత్రంలో సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం నాటికి ఉత్సవాలు నాలుగో రోజుకు చేరడంతో దశావతారాల్లో నాలుగో అవతారమైన నారసింహ అవతారంలో రామయ్య దర్శనమిచ్చారు. అర్చకులు స్వామిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నారసింహావతారంలో ఉన్న రామయ్యను దర్శించుకొని భక్తులు తన్మయత్వం చెందారు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు రోజుకో రూపంలో భక్తులకు దర్శనమిస్తుండంతో వారు పరవశించిపోతున్నారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, అరగింపు, సేవాకాలం, నిత్య పూజలు, నిత్య బలిహరణం, నిత్య హోమాలను భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. ఆ తరువాత నిత్యకల్యాణ మూర్తులను, ఉత్సవమూర్తులను బేడా మండపానికి తీసుకొని వచ్చి అభిషేక తిరుమంజనం జరిపారు. ఆండాల్ అమ్మవారిని, కణ్ణన్ స్వామి వారిని, పన్నిద్రాళ్వార్లను స్వామివారి చుట్టూ ఉంచి చేసి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ముందుగా స్వామివారికి విశ్వక్సేనుడియంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఆశీనులను చేశారు. నారసింహావతారంలో దర్శనమిస్తున్న తమ ఆరాధ్య దైవాన్ని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ముగ్గుమనోహరుడైన స్వామివారిని కనులారా దర్శించుకొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆ తరువాత స్వామివారికి తాతగుడి సెంటర్ వరకూ తిరువీధి సేవ జరిపారు. దేవస్థానం ఈవో రమాదేవి, ఆలయ ప్రధానార్చకులు పాడిదేటి సీతారామానుజాచార్యులు, అమరవాది విజయరాఘవన్, దేవస్థానం ఈశ్వ రవీందర్ రాజు, ఏఈవో భవానీ రామకృష్ణ, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నారసింహావతారంలో రామయ్య

భద్రాచలం : విద్యుత్ దీపకాంతులతో మెరిసిపోతున్న రామాలయం

నారసింహావతారంలో దర్శనమిస్తున్న భద్రాద్రి రామయ్య

పర్ణశాల : నరసింహావతారంలో ఉన్న స్వామివారు

### వెలుగులీనుతున్న రామాలయం

భద్రాచలం, డిసెంబర్ 16: భద్రాచలం సీతారామచంద్రస్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా ఈ నెల 22న తెప్పోత్సవం, 23న ఉత్తర ద్వార దర్శనం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రామాలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాల కాంతులతో భద్రాద్రి రామాలయం వెలుగులీనుతోంది. రామాలయం, గాలి గోపురం, పరిసర ప్రాంతాల్లో దీపకాంతులు విరజిమ్ముతున్నాయి. భద్రాద్రి పట్టణం కలియుగ వైకుంఠంగా విరాజిల్లుతోంది.

### నేడు వామనావతారం..

భద్రాచలం సీతారామచంద్రస్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా స్వామివారు ఆదివారం ఐదో రోజు వామనావతారంలో భక్తులకు అనుగ్రహించనున్నారు. దేవతల సర్వ సంపతలను తన స్వాధీనం చేసుకున్న బలి చక్రవర్తి దగ్గరికి శ్రీమన్నారాయణుడు వామన రూపంలో వెళ్లి మూడు అడుగుల నేలను దానంగా సమ్యరువించి ఒక డుగుతో ఆకాశాన్ని, రెండో అడుగుతో భూమిని ఆక్రమించి, మూడో అడుగును ఎక్కడ మోపాలని బలి చక్రవర్తిని అడగడంతో వచ్చిన వాడు శ్రీమన్నారాయణుడని గ్రహించి తన శిరస్సును మోపమని తెలపడంతో మూడో అడుగుతో బలిని పాతాళానికి అదిమేస్తాడు. ఈ అవతారాన్ని పురస్కరించుకొని స్వామివారికి తొలుత ఆరాధన, పుణ్యాహవాచన జరుపగా ఆచార్య, బ్రహ్మ, రుత్విక్‌లు నాలాయిర దివ్యప్రబంధంలోని 200 పాశురాలను ఆస్థాన స్తోత్రాచార్యులు కేశ స్థలశాయి నేతృత్వంలో గంటపాటు పఠించారు. ఆ తరువాత స్వామివారిని నారసింహావతారంలో అలంకరించి బేడా మండపానికి తీసుకొని వచ్చి పూజలు చేశారు. మధ్యాహ్నం 2 గంటలకు వరాహావతారంలో ఉన్న స్వామివారిని ప్రత్యేక పల్లకిలో ఉంచి చేసి గోదావరి తీరానికి తీసుకెళ్లి హరతులు సమర్పించి కోలాట నృత్యాలు, వేద ఘోష నడుమ మిథిలా స్టేడియంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఆశీనులను చేశారు. నారసింహావతారంలో దర్శనమిస్తున్న తమ ఆరాధ్య దైవాన్ని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ముగ్గుమనోహరుడైన స్వామివారిని కనులారా దర్శించుకొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆ తరువాత స్వామివారికి తాతగుడి సెంటర్ వరకూ తిరువీధి సేవ జరిపారు. దేవస్థానం ఈవో రమాదేవి, ఆలయ ప్రధానార్చకులు పాడిదేటి సీతారామానుజాచార్యులు, అమరవాది విజయరాఘవన్, దేవస్థానం ఈశ్వ రవీందర్ రాజు, ఏఈవో భవానీ రామకృష్ణ, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### పర్ణశాలలో..

పర్ణశాల, డిసెంబర్ 16: దక్షిణ భారతదేశంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల దేవాలయంలోనూ ముక్కోటి ఉత్సవాల సందర్భంగా వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో నాలుగో రోజు శనివారం పర్ణశాల రామయ్య నరసింహ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు శేషకిరణ్ కుమారాచార్యులు, అమరవాది శ్రీకాంత్ చార్యులు, భరద్వాజ్ చార్యులు, రాజగోపాలాచార్యులు, నరసింహ చార్యులు, ఏఈవో శ్రావణ్‌కుమార్, అనిల్, గుమస్తా ప్రసాద్, సిబ్బంది రాము, శివ పాల్గొన్నారు.

రాన్ని దర్శించడం వల్ల గురు గ్రహ బాధలు తొలుగుతాయని ప్రాశస్త్య.

# బియ్యం ధరలకు రెక్కలు

**గతేడాది కంటే ఈసారి సాగువిస్తీర్ణం తక్కువ**
**సాగునీటి కొరతతో ఈసారి తగ్గిన ధాన్యపు దిగుబడులు**
**ఒక్కనెలలోనే క్వింటాకు రూ.500 నుంచి రూ.800 వరకు పెంపు**
**పెరిగిన ధరలతో ఇబ్బందిపడుతున్న పేద, మధ్యతరగతి ప్రజలు**

ఖమ్మం, డిసెంబర్ 16: జిల్లాలో బియ్యం ధరలకు రెక్కలు వచ్చాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ధరలు ఒక్కసారిగా పెరిగాయి. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. సాగర్ ఎడమ కాలువకు నీరు విడుదల కాక పోవడంతోపాటు వర్షాభావ పరిస్థితులు, తుపాన్ కారణంగా ఈ ఏడాది పంట ఎక్కువగా దెబ్బతిన్నది. దిగుబడులు అమాంతం తగ్గాయి. ఆ ప్రభావం బియ్యం ధరలపై పడినట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు. గత నెలకు ఈ నెలకు క్వింటా బియ్యం ధరలు గరిష్ఠంగా రూ.800 వరకు పెరిగాయి. గత వానకాలంలో రైతులుజిల్లావ్యాప్తంగా 3,10,000 ఎకరాల్లో వరి సాగు చేయగా ఈ ఏడాది 2,83,000 ఎకరాల్లో సాగు చేపట్టారు.

### ధరల పెరుగుదల ఇలా..

ప్రస్తుతం మార్కెట్‌లో జైశ్రీరాం రకం ధాన్యం క్వింటా ధర రూ.3,500 ఉండగా, హెచ్‌ఎంటీ రకం ధాన్యం రూ.3,200, తెలంగాణ సాంబ (ఆర్‌ఎన్‌ఆర్) రూ.3,100 – రూ.3200, బీపీటీలు రూ.2,800, జేజీఎ రకం రూ.2,500 పలుకుతున్నది. ఇవే రకాల ధాన్యానికి గత నెలలో రూ.300 వరకు ధర తక్కువగా ఉన్నది. అలాగే హెచ్‌ఎంటీ రకం బియ్యం ధర క్వింటాకు రూ.5,000 ఉండగా , రా బియ్యం క్వింటా రూ. 4,700 – రూ.4,800 పలుకుతున్నది.

### సాగునీరు లేక దిగుబడులు తగ్గాయి..

గతేడాది ఖరీఫ్ కంటే కూడా ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి సాగు అంతా అశాజనకంగా లేదు. పంట దిగుబడులు తగ్గాయి. నాగార్జున సాగర్ ఎడమ కాలువకు నీరు రాక పోవడంతో పంట వేస్తే నష్ట పోతామనే భయంతో సాగర్ ఆయకట్టు రైతులు వరి వేయలేదు. దీనికి తోడు తుపాన్ కారణంగా కొంత పంట దెబ్బతింది. ఇలా పలు కారణాల రీత్యా ఖరీంనగర్ స్థాయిలో ధాన్యం దిగుబడి రాలేదు..
**– విజయనిర్మల, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, ఖమ్మం**

### బియ్యం ధరలు చూస్తుంటే భయం వేస్తుంది

రోజురోజుకు పెరుగుతున్న బియ్యం ధరలు చూస్తుంటే భయం వేస్తుంది. వ్యాపారులం దరూ కుమ్మక్కై బియ్యం ధరలను పెంచుతున్నారనిపిస్తున్నది. ఈ ఏడాదివరి బాగానే పండింది కదా. పేద ప్రజల పొట్టకొట్టడమే వ్యాపారులు పనిగా మారింది. కిలో బియ్యం రూ.60- 70 పెట్టి కొనాలంటే నిరుపేదలకు ఇబ్బందే. **– ఆర్.సోమమ్మ, నగరవాసి, ఖమ్మం**

### సగం డబ్బులు బియ్యానికే సరిపోతున్నవి

రోజు చేసే కష్టంలో సగం డబ్బులు బియ్యానికే సరిపోతున్నాయి. బియ్యం ధరలు ఇలా ఉంటే ఇక నూనె, పప్పుతోపాటు ఇతర సరుకులు, కూరగాయలు ఏం పెట్టి కొనాలి? పిల్లలను ఎలా చదివించుకోవాలి? ఎలా బతకాలి? ఒకప్పుడు కిలో బియ్యం చాలా తక్కువ ధరకే అందుబాటులో ఉండేవి. నాడు ఎలాంటి ఇబ్బందులు లేవు. ఇప్పుడు బియ్యం ధరలు చుక్కలు చూపిస్తున్నాయి.
**– ఎన్.ప్రేమానందం, నగరవాసి, ఖమ్మం**

### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలు తగ్గించాలి..

ప్రస్తుతం పావు క్వింటా బియ్యం బస్తా మార్కెట్‌లో రూ.1,500 వరకు ఉంది. బియ్యం ధరలు ఇంకా పెరుగుతాయట. రాను రాను ధరలు మరింత పెరుగుతాయని కిరాణ దుకాణ యజమానులు అంటున్నారు. పెరుగుతున్న బియ్యం ధర లతో పేదలకు ఇబ్బందే. పెరుగుతున్న ధరలను వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే తగ్గించాలి.
**– ఎ.సుహాసిని, గృహిణి, ఖమ్మం**

## నేడు 'బండి పార్థసారథిరెడ్డి'
# లైబ్రరీ ప్రారంభం

సత్తుపల్లి టౌన్, డిసెంబర్ 16: సత్తుపల్లి పట్టణంలోని రెవెన్యూ గెస్ట్‌హౌస్‌లోని ఖాళీ స్థలంలో హెటిరో డ్రగ్స్ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి రూ.2 కోట్ల సొంత నిధులతో నిర్మించిన గ్రంథాలయాన్ని ఆదివారం ఆయన శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి గ్రంథాలయ సంస్థకు అప్పగించనున్నారు. నాటి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు విజ్ఞప్తి మేరకు రాజ్యసభ సభ్యుడు వెంటనే స్పందించి లైబ్రరీ నిర్మాణానికి ముందుకు వచ్చారు. కలెక్టర్ వీపీ గౌతమ్ కూడా పట్టణంలో నిరుపయోగంగా ఉన్న రెవెన్యూ గెస్ట్‌హౌస్ ఆవరణలో 12 కుంటల భూమిని లైబ్రరీకి కేటాయించారు. దీంతో పనులు చకచకా ప్రారంభమై ఇటీవల పూర్తయ్యాయి. వైట్ హౌస్ మోడల్‌లో ప్రస్తుతం రెండు అంతస్తుల గ్రంథాలయ భవనం అందుబాటులోకి వచ్చింది. లైబ్రరీ ప్రారంభమైతే ఇక విద్యార్థులు ప్రతిరోజూ ఇక్కడికి వచ్చి చదువుకునేందుకు వీలు కలుగుతుంది. లైబ్రరీలో రెండు డిజిటల్ లైబ్రరీలు, విద్యార్థులు చదువుకోవడానికి వీలుగా ఫర్నిచర్ అందుబాటులో ఉంటాయి.

### విద్యార్థులకు అండగా నిలిచేందుకే..

నేను చదివిన ప్రాంతానికి చెందిన విద్యార్థులకు నావంతు సాయం చేయాలనే ఉద్దేశంతో లైబ్రరీ నిర్మించేందుకు ముందుకొచ్చాను. అత్యాధునిక హంగులతో లైబ్రరీని కంప్యూటరైజ్డ్ చేస్తున్నాం. పేద విద్యార్థులు లైబ్రరీలో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నాను.
**– రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి**

## నేడు 'భలే మంచిరోజు'
### ఎన్‌టీఆర్, ఏఎన్ఆర్ శతజయంతి ఉత్సవాల నిర్వహణ

ఖమ్మం, డిసెంబర్ 16: అమరగాయకుడు ఘంటసాల వేంకటేశ్వరరావు 102వ జయంతి సందర్భంగా ఖమ్మానికి చెందిన సుధాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో 'భలేమంచిరోజు' సినీ సంగీత విభావరిని నిర్వహించనున్నట్లు సుధాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ టీ.వాసుదేవ్, శత గోపం.సుదర్శన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ ఏడాది ఈ కార్యక్రమాన్ని ఎన్‌టీఆర్, ఏఎన్ఆర్, కాంతారావు, సూర్యాకాంతం వంటి నటుల శతజయంతి వేడుకలా నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా ప్రముఖ సంగీత దర్శకుడు సాలూరు వాసూరావు, కలెక్టర్ వీపీ గౌతమ్, ఏపీ సివిల్ సప్లయీస్ కమిషనర్ అరుణ్‌కుమార్ ఇతర ప్రముఖులు హాజరుకానున్నట్లు చెప్పారు.